పొంగిన వాగులు, వంకలు


గుత్తి రూరల్: లచ్చానుపల్లి వద్ద పెద్దవంకలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు


పెద్దపప్పూరు: నామనాంకపల్లి వద్ద జోరుగా పారుతున్న వంక


తాడిపత్రి టౌన్: బుగ్గ వద్ద పరవళ్లు తొక్కుతున్న దేవరకొన జలపాతం

- యల్లనూరు, గుత్తిలో భారీ వర్షం
- చెరువుల్లోకి చేరిన నీరు..

గుత్తి/గుత్తి రూరల్: గుత్తిలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 86.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ పుణ్యవతి గురువారం తెలిపారు. భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తింది. చెట్నేపల్లి రైల్వే బ్రిడ్జి కింద భారీగా వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం తలెత్తింది. గుత్తిలోని తాడిపత్రి రోడ్డు, అనంతపురం రోడ్డు, రాయల్ సర్కిల్ కూడలిలో వర్షం నీరు రోడ్లపై మోకాల్లోతు ప్రవహించింది. డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లాయి. వాహనదారులు, పాదచారులు ముఖ్యంగా దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్లు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. చెత్తా చెదారం, మురుగు తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అలాగే మండల వ్యాప్తంగా బేతాపల్లి, కరిడికొండ, యంగన్నపల్లి, బ్రాహ్మణపల్లి, పి.ఎర్రగుడి, ఈశ్వరపల్లి, బసినేపల్లి గ్రామాల్లో భారీ ఎత్తున వాన కురిసింది. గుత్తి–పత్తికొండ మార్గంలో బసినేపల్లి వద్ద ఉన్న పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. యంగన్నపల్లి, బేతాపల్లి గ్రామాల్లో పంటలు వర్షం నీటిలో మునిగాయి. బ్రాహ్మణపల్లి, అబ్బేదొడ్డి, పి.ఎర్రగుడి గ్రామాల్లోని చెరువులలోకి భారీగా వర్షం నీరు చేరాయి. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి 106.4 మి.మి. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రాము తెలిపారు. ఎండుతున్న పంటలకు కాస్త ఉపశమనం లభించిందన్నారు. అలాగే ఎండిపోయిన బోర్లల్లో నీటిమట్టం పెరిగే ఆస్కారం ఉందన్నారు. ఎక్కడైనా మట్టి మిద్దెలు, పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయో తెలుసుకోవాలని వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లకు తహసీల్దార్ ఆదేశించారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఓ మోస్తారు వర్షం కురిసింది. మండలంలో దాదాపు 44.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు మండలంలోని ఆలూరు కోన జలపాతం, బుగ్గ సమీపంలో ఉన్న దేవరకోన జలపాతాలు పరువళ్లు తొక్కుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, కంది, వేరుశనగకాయ రైతులకు ఈ వర్షం అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పెద్దపప్పూరు: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి నామనాంకపల్లి, చీమలవాగుపల్లి, కొట్టాలపల్లి వంకలు జోరుగా ప్రవహించాయి. మండలంలో దాదాపు 31.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. పదునైన వర్షం కురిసిందని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చీమలవాగుపల్లి వంక జోరుగా ప్రవహిస్తుండడంతో దాదాపు 5గంటల పాటు రాకపోకలు స్తంభించాయి.


పెద్దపప్పూరు: చీమలవాగుపల్లి వద్ద ప్రవహిస్తున్న వంక


గుత్తి: చెట్నేపల్లి రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం

కనువిందు చేస్తున్న కోన జల సోయగాలు


ఆకట్టుకుంటున్న కోన జలపాతం

యాడికి: మండలంలోని కోన క్షేత్రంలో రామలింగేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న కోన జలపాతం, అర కిలో మీటరు దూరంలో ఆలయానికి వెనుక ఉన్న మారాడమ్మ జలపాతం కనువిందు చేస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల వల్ల నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బూరుల, నేరేడు చెర్ల గ్రామాలలోని కొండల నుంచి ధారా వాహికంగా జలాలు తరలివస్తున్నాయి. దీంతో జలపాతాలో కనువిందు చేస్తున్నాయి. జలపాతాల నుంచి వచ్చే నీరు యాడికి మండలంలోని కోన ఉప్పల పాడు, ఓబులాపురం, కమలపాడు, నిట్టూరు, చీకేపల్లి మీదగా తాడిపత్రి పెన్నానదికి ప్రవహిస్తున్నాయి. నిట్టూరు గ్రామ సమీపంలో తాడిపత్రి రహదారికి పోయే వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే యాడికి– వేముల పాడు మధ్యలో ఉన్న వంకలో ఓ కారు ఇరుక్కుంది. వంకలో ఇరుక్కున్న కారును స్థానికులు ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. పెద్ద పేట గ్రామంలోని ఎస్సీ కాలనీ జలమయవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి

గుత్తి: ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని, రాజీకి అవకాశమున్న కేసులన్నింటినీ పరిష్కరించాలని న్యాయవాదులు, పోలీసులకు సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి సూచించారు. గుత్తిలోని ఏడీజే కోర్టు హాల్లో గురువారం న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇరు వర్గాలను రాజీ చేసి, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సందేహం ఉన్నా తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ సురేఖ, ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్ఐ గౌతమ్, ఏఎస్ఐ నాగరాజు, ఏజీపీ ఫక్కృబాషా, న్యాయవాదులు ధనుంజయ, సూర్యనారాయణ, శ్రీధర్, నబీరసూల్, జడ్.సతీష్, చలపతి, విజయభాస్కర్, నూర్ మహమ్మద్, కోర్టు సిబ్బంది సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30కు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సదాశివం గురువారం తెలిపారు. కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

16న పుట్లూరులో..

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం


అలంకరణలో ఏకాంగేశ్వర స్వామి

పెద్దపప్పూరు: మండలంలోని చింతరపల్లిలో వెలసిన ఏకాంగేశ్వరస్వామి ఆరాధనోత్సవాలు గురువారం హోమంతో ప్రారంభమయ్యాయి. ఆయన శివైక్యం తరువాత ఆయన శిష్యులు అదేమార్గంలో నడిచి ఆధ్యాత్మిక బోధనలు చేసేవారు. కాలక్రమేణా ఏకాంగేశ్వర సమాధితో పాటు ఆశ్రమంలో ఆయన శిష్యుల సమాధులు ఉన్నాయి. తెన్నటం వంశస్తులు ఏటా స్వామివారి ఆరాదనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శుక్రవారం స్వామివారికి నైవేద్యం సమర్పించి స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మఠం పర్యవేక్షకుడు సత్య స్వామి తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడులో ఉన్న అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ గంగాధర్, ప్రిన్సిపాల్ సునీత, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఎంఎస్పీ నాయకులు మధు, శ్రీరాములు, అమర్‌నాథ్, హరి గోపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఏపీఎం శివకుమార్‌రెడ్డి

పెద్దపప్పూరు: గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని, పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శకుంతల, ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా సభ దృష్టికి తీసుకువస్తే , వాటి పరిష్కారం కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పప్పక కళావతి, డిప్యూటీ తహసీల్దార్ శ్వేత, ఈఓఆర్డీ సురేష్, వెలుగు ఏపీఎం శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఆవు మృతి


మృతి చెందిన ఆవు

పామిడి: పట్టణంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై అయ్యప్ప గుడి సమీపాన జరిగిన కారు ఢీకొని ఆవు మృతి చెందింది. వివరాలు.. అనంతపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు, ఆవును ఢీ కొనడంతో ప్రమాదం సంభవించింది. పామిడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన


పిల్లల హక్కులు, చట్టాలపై బ్యానర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా పిల్లల హక్కులు, చట్టాలపై 10 రోజుల అవగాహన సదస్సు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్వేరి మాట్లాడారు. యువ, సఖి గ్రూపులను ప్రతి స్కూల్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు సంబంధించిన అన్ని చట్టాలపై అవగాహన కల్పించడమే ఈ గ్రూపు ఉద్దేశ్యమన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ సభ్యులు శ్రీకళ, మంజుల, గృహ హింస నిరోధక చట్టం విభాగం సభ్యులు ఉమాదేవి, జిల్లా వైద్య శాఖ సభ్యులు వేణుగోపాల్, డాక్టర్ గంగాధర్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని తిమ్మంపల్లి సెక్టారు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శాంతమ్మ అన్నారు. గురువారం కూచివారిపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బాల్య వివాహాలు, చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు హేమావతి, వెంకటరమణమ్మ, ఏఎన్ఎం అనూష, అలివేలమ్మ, ఆశా కుళ్లాయమ్మ పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలి


కేకును కట్ చేసి విద్యార్థులకు పంచుతున్న దృశ్యం

గుంతకల్లు: ప్రతి విద్యార్థీ లక్ష్య సాధన కోసం కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల బీకాం కంప్యూటర్స్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగతోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, డైరెక్టర్ గోపాల్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కె.నటరాజ్ మాట్లాడుతూ జూనియర్లు, సీనియర్లు స్నేహభావంతో మెలగాలన్నారు. విద్యార్థులు ఆటపాటలతోపాటు చదువుల్లోనూ రాణిస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అమీర్, అధ్యాపకులు బసెట్టి క్రిష్ణయ్య, డాక్టర్ కృష్ణానంద, డాక్టర్ సుభాషిని, డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలని రైతుల వినతి



యల్లనూరు: పంటల సాగు సీజన్ సమయంలో చింతకాయమంద, తిమ్మంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల్లోని సచివాలయాలకు ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని రైతులు కోరారు. తిమ్మంపల్లిలోని ప్రైవేట్ ఎరువుల దుకాణంలో యూరియా అధిక ధరకు డీలర్లు విక్రయిస్తున్నారని, కొనలేకున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆసరాను అవకాశంగా తీసుకుని యూరియా బస్తాలపై ధరలను పెంచి అమ్ముకుంటున్నారన్నారు. తక్షణమే యూరియా ఆయా సచివాలయాలకు అందేలా ఇన్‌చార్జ్ ఏఓ మధుకుమార్ చర్యలు తీసుకోవాలని రైతులు గొడ్డుమర్రి ఈశ్వరరెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, చింతకాయమంద నాగరంగయ్య, రమణ, తిమ్మంపల్లి రైతులు కోరారు.

దళితుల భూ సమస్య పరిష్కరించాలి


గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురంలో దళితుల భూ సమస్యలు రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధితులతో కలసి గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి, ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మండల ంలోని పెనకచెర్ల రెవెన్యూ పొలం 580–4 సర్వే నంబర్‌లో 5.40 ఎకరాల భూమి ముకుందాపురానికి చెందిన దళితులకు 1983లో డీ పట్టా మంజూరు చేశారన్నారు. అయితే దళితులు కూలి పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో.. అదే గ్రామానికి చెందిన సూర్యచంద్రరెడ్డి అక్రమంగా దళితులకు చెందిన భూమి, రెవెన్యూ అధికారుల ద్వారా తన పేరు మీద ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, మల్లికార్జున, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు


బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపులు

తాడిపత్రి రూరల్: అనంతపురంలో బుధవారం నిర్వహించిన కూటమి ప్రభుత్వ సమావేశానికి తరలించిన బస్సులు పూర్తి స్థాయిలో తిరిగి రాకపోవడంతో గురువారం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అరకొర బస్సులతో ప్రయాణికులు కిక్కిరిసిపోయి అవస్థలు పడ్డారు. తాడిపత్రి పట్టణం మూడు జిల్లాలకు సరిహద్దుగా ఉండటంతో.. ఆయా జిల్లాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలు లేక ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ప్రధానంగా తాడిపత్రికి బనగానపల్లి, నంద్యాల, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, పులివెందుల తదితర ప్రాంతాల నుంచి రోజూ ఎక్కువ సర్వీసుల రాకపోకలు జరుగుతుంటాయి. తాడిపత్రి నుంచి అనంతపురానికి కూడా ఎక్కువ సర్వీసులు నడుపుతుంటారు. కూటమి సమావేశానికి వెళ్లిన బస్సులు ఎక్కువ శాతం తిరిగి రాకపోవడంతో ప్రయాణికులు నానా కష్టాలు పడ్డారు. ముఖ్యంగా మహిళలు గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండటం కనిపించింది. బస్సులు రాకపోవడంతో చేసేదేమి లేక పలువురు ప్రయాణికులు అసంతృప్తితో తిరిగి బస్టాండ్ నుంచి ఇళ్లకు వెళ్లారు.

మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడి


ముచ్చుకోటలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మాధవి, హెచ్ఓ ఉమాదేవి


కొట్టాలపల్లిలో రైతులకు సూచనలిస్తున్న సహాయ సంచాలకురాలు రోజా పుష్పలత

పెద్దపప్పూరు: పండ్ల తోటల సాగులో సరైన మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని రేకుల కుంట వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త మాధవి సూచించారు.గురువారం ముచ్చుకోట, అమ్మల దిన్నె గ్రామాల్లో అరటి, దానిమ్మ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అరటిలో ఎక్కువగా శిగటోక తెగులు ఆశించడం వల్ల ఆకులపై తొలుత చిన్న చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి బూడిద రంగులోకి మారతాయన్నారు. సకాలంలో గుర్తించి అధికారులు సూచించిన మందులను పిచికారీ చేస్తే ప్రారంభదశలోనే శిగటోకా తెగులు అరికట్టవచ్చన్నారు. పండ్లతోటల సాగులో ఎలాంటి సందేహం ఉన్నా సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఉద్యానశాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉంటారని హెచ్ఓ ఉమాదేవి తెలిపారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని కొట్టాలపల్లి, వడియంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మట్టి నమూనాల విశ్లేషణ ప్రయోగ శాల సహాయ సంచాలకులు రోజా పుష్పలత హాజరై మాట్లాడారు. పొంట పొలాల్లో అనవసరంగా రసాయణ మందులు వాడకూడదన్నారు. ఎరువులు వాడకం తగ్గించుకోవాలన్నారు. అనంతరం వివిధ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు ఇర్ఫాన్, చౌడేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు 50 శాతం సబ్సిడీతో ట్రైకోడెర్మా విరిడి

శింగనమల: శింగనమల రైతు సేవా కేంద్రంలో 50 శాతం సబ్సిడీపై ట్రైకోడెర్మా విరిడి పంపిణీ చేస్తున్నట్లు ఏఓ అన్వేష్‌కుమార్ గురువారం తెలిపారు. ట్రైకోడెర్మా విరిడి లీటర్ రూ.100 కాగా, 50 శాతం సబ్సిడీతో రూ.50కు అందజేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బుక్కరాయసముద్రం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యురాలు స్వాతి లక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో 54 మంది హై రిస్క్ గర్భిణులకువైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ నాగలక్ష్మమ్మ, సూపర్ వైజర్లు, విజయలక్ష్మి, సత్య నారాయణ శాస్త్రి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ధనుంజయ పాల్గొన్నారు.

'పేదల జీవితాలు చీకటిమయం'

పామిడి: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ లైసెన్సు చేయకపోవడంతో పేదల జీవితాలు చీకటిమయమవుతాయని ఏపీ హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఎద్దులపల్లి జెడ్పీహైస్కూల్‌లోని విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెవెన్యూల్ నిలిపివేయడంతో బడుగు, బలహీన వర్గాల పేదలు, రైతులు, విద్యార్థుల అభ్యున్నతికి గ్రహణం ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యువల్ చేయించి పేదల జీవితాల్లో వెలుగు నింపాలన్నారు.

యూటీఎఫ్ 'రణభేరి' విజయవంతం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న విజయవాడలో నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు రాఘవేంద్ర, రాజ్‌కుమార్ కోరారు. గురువారం సాయంత్రం సరోజినీనాయుడు మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో రణభేరి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమీషన్‌ను వెంటనే నియమించాలని, డీఏలు విడుదల చేసి బకాయిలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించి పని ఒత్తిడి తగ్గించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలన్న డిమాండ్‌లతో చేపట్టనున్న రణభేరికి ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు రామాంజినేయులు, శంకరయ్య, రవిబాబు, రామ్మోహన్, రేవణసిద్ధయ్య, శంకర్‌నాయక్, రవిప్రసాద్, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కల్పన, గిరిబాబు పాల్గొన్నారు.

'పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలి'

పామిడి: కూటమి ప్రభుత్వం పాలనలో అన్నదాతల జీవితాలు చీకటిమయమయ్యాయని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పామిడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్ల రూపాయలు వెచ్చించి సభల పేర ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ చెల్లించి అన్నదాతల ను ఆదుకోవాలన్నారు. ఆపార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నారప్ప, నాయకులు ఉమేష్, ఏకాంత్‌రెడ్డి, వెంకటనాయక్, సునీల్, హరిష్ పాల్గొన్నారు.

'సేవ్ ఆర్డీటీ' విజయవంతం చేయండి

పెద్దవడుగూరు: అనంతపురంలో ఈ నెల 15న నిర్వహించే సేవ్ ఆర్డీటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కొండయ్య కోరారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన గతంలో ఆర్డీటీ లేని సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తు చేశారు. నిరుపేదలకు అండగా నిలిచిన సంస్థ సేవలను ఆపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సును రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని కడదరగుట్టపల్లి గ్రామానికి చెందిన భీమలక్ష్మమ్మ(103) గురువారం తెల్లవారు జామున మృతి చెందింది. గ్రామంలోని మహిళలతో సన్నిహితంగా ఉంటూ గర్భిణులకు కాన్పులు చేయడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించేవారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఇంటి వద్దకు చేరుకుని సంతాపం తెలిపారు. ఆమె సేవలను కొనియాడారు. సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లోనూ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గుత్తి శాఖ (01701), గుత్తి, అనంతపురము జిల్లా.

స్వాధీనత ప్రకటన
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్) 2002 లోని రూల్ 8(1) క్రింద
(స్థిరాస్తి కొరకు)

2002 సంవత్సరము సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (Second) 2002 (చట్టం 54 ఆఫ్ 2002) క్రింద దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుత్తి బ్రాంచి (01701)** అనంతపురము జిల్లాకు అధీకృత అధికారిగా ఉంటూ మరియు 2002వ సంవత్సరపు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్-3 తో చదువుకోబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీత అయిన **మెసర్స్ కుర్పూర్ ఫ్యాషన్స్** వారికి నోటీసులో తెలియచేసిన బకాయి సొమ్ము **Rs.20,41,250/- (రూపాయలు ఇరవై లక్షల నలభై ఒక్క వేల రెండు వందల యాభై మాత్రమే) మరియు వడ్డీ, ఖర్చులు** ను ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ తేది.**28.05.2025** నాడు డిమాండు నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత/హామీదారు సదరు బకాయి సొమ్ము చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు సదరు చట్టంలోని రూల్స్ యొక్క రూల్-8తో చదువబడే సెక్షన్ **13(4)** క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **11.09.2025** నాడు లాంచనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలముగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకంగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి సదరు ఆస్తి విషయమై ఎవరు కూడా ఎవరితోనూ ఎలాంటి లావాదేవీలు జరుపరాదని అట్లు కాదని జరిపిన యెడల **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జికి అనగా **Rs.20,41,250/-(రూపాయలు ఇరవై లక్షల నలభై ఒక్క వేల రెండు వందల యాభై మాత్రమే)** మరియు వడ్డీ ఇతర ఖర్చులతో సహా మొత్తాన్ని చెల్లించేందుకు బాధ్యులగుదురని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుటకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

శ్రీ అచ్చుకట్ల ఖాదిర్ బాషాకు చెందిన అనంతపురము ఆర్.డి., గుత్తి ఎస్.ఆర్.డి., పత్తికొండ రోడ్డు, సర్వే నెం.510/బి, డోర్.నెం.1/121 దగ్గర,మున్సిపల్ ట్యాంక్, లలిత ఆయిల్ మిల్లు ప్రక్కన ఉన్న నివాస భూమి. **దీనికి హద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** ఉప్పరపెద్ద వెంకటస్వామికు చెందిన భూమి, **ఉత్తరము:** అదే సర్వే నెంబరులోని వారందరికి రస్తా, **దక్షిణము:** రంగనాథకు చెందిన స్థలము. **కొలతలు: విస్తీర్ణము:** తూర్పు వైపు:41 అడుగులు, పడమర వైపు:55.1/2 అడుగులు, ఉత్తరము వైపు:221 అడుగులు, దక్షిణము వైపు:231 అడుగులు. మొత్తము విస్తీర్ణము:1211.61చ॥గ॥లు.

తేది: 11.09.2025. — **సం/- అధీకృత అధికారి,**
ప్రదేశము: గుత్తి బ్రాంచి — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.**

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడిపత్రి డివిజన్

9912220722, 7093156622, 9912220732